

జేకే ఫెన్నార్ కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

బీఆర్‌టీయూని గెలిపించాలి

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జూన్ 16: జేకే ఫెన్నార్ పరిశ్రమ కార్మిక సంఘం ఎన్నికల్లో బీఆర్‌టీయూను గెలిపించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలో నిర్వహించిన పరిశ్రమ జనరల్ బాడీ సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జేకే ఫెన్నార్ పరిశ్రమలో త్వరలో జరుగనున్న కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఆర్‌టీయూ కార్మిక సంఘాన్ని గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో కార్మిక సంక్షేమానికి కట్టుబడి ఉన్న సంఘం తమదేనన్నారు. కార్మికులకు మెరుగైన వేతనాలు, అగ్రిమెంట్లు చేయడం బీఆర్‌టీయూకే సాధ్యమవుతుందన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత తోపాటు గొప్ప వేతన అగ్రిమెంట్లు చేస్తామని హామీనిచ్చారు. ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న హెచ్‌ఎంఎస్ కార్మిక సంఘం కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. కార్మికుల జీవితాలతో ఆ సంఘం చెలగాటమాడుతున్నదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి యాదగిరియాదవ్, సంఘం ప్రతినిధులు తిరుపతి గౌడ్, నవీన్‌కుమార్, శ్రీనివాస్‌రావు, పీజే రెడ్డి, యాదగిరి, నరసయ్య, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించాలి

రామచంద్రాపురం, జూన్ 16: రోగులకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించాలని ధ్రువ విజయ హెల్త్‌కేర్ సర్వీసెస్ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ప్రొటెం మాజీ చైర్మన్ వి.భూపాల్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆర్సీపురం లక్ష్మీగార్డెన్స్‌లో ధ్రువ విజయ హెల్త్‌కేర్ సర్వీసెస్ సంస్థ 5వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ప్రొటెం మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాభాపేక్ష కాకుండా పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పానగేశ్, బీఆర్ఎస్ నాయకులు ఆదర్శ్ రెడ్డి, అంజయ్య, గూడెం మధుసూదన్‌రెడ్డి, యాదగిరియాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

హద్దులు చెరిపేసి ఆక్రమణకు యత్నం

- ఖాజీపల్లిలో ఘటన
- రెవెన్యూ అధికారుల సీరియస్

ఇండ్ల స్థలాలకు కేటాయించి భూమిని చదును చేసిన దృశ్యం

జిన్నారం, జూన్ 16: ఖాజీపల్లి పరిధిలోని సర్వేనంబర్ 181 ప్రభుత్వ భూమిలో ఇండ్ల స్థలాల కోసం లేఅవుట్ చేసిన స్థలాన్ని ఆదివారం తెల్లవారుజామున కొందరు వ్యక్తులు ట్రాక్టర్‌తో దున్నేశారు. హద్దులను తొలిగించి స్థలాన్ని దున్ని ఆక్రమణకు యత్నించారు. దీనిపై రెవెన్యూ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేయగా ఈ దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తులు ఎవరో తెలుసుకునేందుకు ఆరా తీస్తున్నామన్నారు. వివరాలోకి వెళ్తే.. ఖాజీపల్లి పరిధిలోని సర్వేనంబర్ 181 ప్రభుత్వ భూమిలో జర్నలిస్టులు, గ్రామస్తులకు ఇండ్ల స్థలాలు కేటాయించేందుకు రెవెన్యూ అధికారులు ఐదెకరాల స్థలం కేటాయించారు. ఇందులో 99 ప్లాట్లు చేశారు. ఖాజీపల్లి గ్రామస్తులకు, జర్నలిస్టులకు కలిపి 77 ప్లాట్లు కేటాయించారు. ఇంకా 22 ప్లాట్లు కేటాయించాల్సి ఉంది. ఆదివారం తెల్లవారుజామున 22 ప్లాట్ల హద్దులను తొలిగించి ట్రాక్టర్‌తో దున్నేశారు. గమనించిన గ్రామస్తులు, జర్నలిస్టులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ ఇండ్ల స్థలాలను దున్నేసిన వ్యక్తి ఎవరనేది ఆరా తీస్తున్నామని, సదరు వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

కాంగ్రెస్‌లోకి సోలక్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్



గోపాల్‌రెడ్డికి కాంగ్రెస్ కండువా వేస్తున్న కాట శ్రీనివాస్‌గౌడ్

జిన్నారం, జూన్ 16: సోలక్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ నలగండ్ల గోపాల్‌రెడ్డి, నాయకుడు ప్రభాకర్‌గౌడ్ ఆదివారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా తన నివాసంలో కాంగ్రెస్ కండువా వేసి కాట శ్రీనివాస్‌గౌడ్ కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, బ్లాక్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, ఆది మల్లేశ్ పాల్గొన్నారు.

బక్రీద్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

మైనార్టీ పెద్దలకు డస్ట్‌బిన్ కవర్లను అందజేస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, జూన్ 16: బక్రీద్ పండుగకు ఆర్సీపురం డివిజన్‌లోని ఈద్గాలో ఏర్పాట్లు పూర్తయ్యాయని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ అన్నారు. ఆదివారం శ్రీనివాస్‌నగర్‌లోని ఈద్గాను ఆమె సందర్శించారు. బల్దియా సిబ్బంది చేత ఈద్గా ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. మైనార్టీ పెద్దలకు డస్ట్‌బిన్ కవర్లను అందజేశారు. ముస్లింలు బక్రీద్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, మైనార్టీ నాయకులు అబీ బ్, అబ్దుల్‌గఫర్, యాసిన్, నజీర్, సాబీర్, మల్లేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఓల్డ్ ఆర్సీపురంలో కార్పొరేటర్ పర్యటన

ఆర్సీపురం డివిజన్‌లోని ఓల్డ్ ఆర్సీపురం 2వ బ్లాక్‌లో కార్పొరేటర్ పుష్పానగేశ్ పర్యటించారు. బస్తీలో డ్రైనేజీ సమస్య తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనుల కోసం రూ.7 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరిస్తామని బస్తీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాస్కర్, రాములు, సత్తి, జంగయ్య పాల్గొన్నారు.

ఊట్లలో ఘనంగా గంగమ్మ జాతర

గంగమ్మ జాతరలో నీలం మధు, ఎంపీపీ రవీందర్‌గౌడ్ తదితరులు

జిన్నారం, జూన్ 16: మండలంలోని ఊట్ల గ్రామంలో ఆదివారం సాయంత్రం గంగమ్మ జాతర ఘనంగా జరిగింది. మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతరకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు, ఎంపీపీ రవీందర్‌గౌడ్, వైస్ ఎంపీపీ గంగరమేశ్ హాజరై గంగమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మత్స్య సహకార సంఘం నాయకులు ముఖ్య అతిథులను సన్మానించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ గంగమ్మ దయతో ప్రజలందరు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జింకల శివరాజ్, మాజీ ఉపసర్పంచ్ జింకల రవీందర్, మత్స్య సహకార సంఘం నాయకులు ఎస్.మహేశ్, బొగురు సత్యనారాయణ పాల్గొన్నారు.

సోయా.. సాగు చేద్దామిలా

- నల్లరేగడి భూములు సాగుకు అనుకూలం
- సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక లాభాలు
- అంతర కృషితో కలుపు నివారణ

ఎరువుల వాడకం ఇలా..

న్యాల్‌కల్, జూన్ 16: సోయాబీన్ నూనె గింజల పంట. తక్కువ కాలంలో మంచి దిగుబడి వచ్చే పప్పు జాతి పంట.. వానకాలం సీజన్‌లో రైతులు అధికంగా పత్తి, సోయాబీన్, కంది, పెసర, మినుము, జొన్న తదితర పంటలు సాగు చేస్తారు. అందులో సోయాబీన్ పంట ఒకటి. ఈ పంట సాగు చేసేందుకు నల్లరేగడి భూములు అనువైనవి. భూములను చదును చేసుకొని విత్తనం విత్తుటకు సిద్ధం చేసుకోవాలి. సోయాబీన్ పంటను సాగు చేసుకునేందుకు జూలై 10వ తేదీ వరకు అవకాశం ఉందని వ్యవసాయాధికారి లావణ్య సూచించారు. సోయా సాగులో రైతులు తగు జాగ్రత్తలను పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని చెబుతున్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

సోయాబీన్ పంట విత్తడం కంటే ముందుగా ప్రతి కిలో సోయాబీన్ విత్తనానికి 2 గ్రాముల థైరమ్, ఒక గ్రాము కార్బండిజమ్ లేదా 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టన్ మందుతో, తర్వాత 5 మిల్లీ లీటర్ల ఇమిడాక్లోప్రిడ్ లేదా 30 గ్రాముల కార్బోసల్ఫాన్‌తో విత్తనం శుద్ధి చేయాలి. ప్రిత 8 నుంచి 10 కిలోల విత్తనానికి 200 గ్రాముల రైజోబియం జపానికం కల్చర్ కలిపి నీడలో ఆరబెట్టాలి. ఆ తర్వాత విత్తుకోవాలి. నల్లరేగడి భూముల్లో అయితే 45 సెంటీమీటర్ల వెడల్పు, 5 సెంటీ మీటర్ల దూరం, తేలిక భూముల్లో అయితే 30 మీటర్ల వెడల్పు, 7.5 సెంటీ మీటర్ల దూరంలో విత్తుకోవాలి. ఎకరానికి 25 నుంచి 30 కిలోల వరకు సోయాను విత్తుకోవాల్సి ఉంటుంది.

సోయాబీన్ సాగు చేసే భూముల్లో ఎకరానికి 12 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 16 కిలోల పొటాష్ చివరి దుక్కిలో వేయాలి. భాస్వరం ఎరువును సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో వేస్తే గంధకం కూడా లభిస్తుంది. 50 శాతం నత్రజని విత్తేప్పుడు, పైరు నెల రోజులకు చేరిన తర్వాత మరో 50 శాతం నత్రజని వేయాలి. సోయా పంట ఎదుగుదలకు పూత, కాత దశలో 2 శాతం యూరియా 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాల్సి ఉంటుంది. పంటలకు చిత్త పురుగులు, రసం పీల్చే పురుగు, కాండం తొలిచే పరుగు, ఈగ, ఆకు గూడు పురుగు, పొగాకు లద్దె పురుగులు ఆశిస్తాయి. వీటి నివారణకు ఒక గ్రామం ఎస్సీ ఫేట్ లేదా మోనోక్రోటోపాస్ 6 మిల్లీ లీటర్లు లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి విచికారీ చేయాలి.

కలుపు నివారణ చర్యలు

సోయాబీన్ పంటలో కలుపు నివారణ కోసం పెండిమిథాలిన్ 30 శాతం 1.4 లీటర్ల చొప్పున విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు పిచికారీ చేయాలి. సోయా విత్తిన 20-25 రోజుల్లో గొర్రుతో అంతర కృషి చేయాలి. లేకుంటే కిజాల్‌ఫాస్ ఇథైల్ 5 శాతం 400 మిల్లీ లీటర్ల కలిపి పిచికారీ చేసి గడ్డి జాతి మొక్కలను, ఇమాజిథాపైర్ 10 శాతంను 250 మిల్లీ లీటర్ల చొప్పున పిచికారీ చేసి వెడల్పుకు, గడ్డి జాతి కలుపును నిర్మూలించుకోవచ్చు. ఆయా మందులను ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి

సమయానికి తడులు అందించాలి

సోయాబీన్ వర్షాధార పంట. ఈ పంట మొలక దశలో, పూత దశలో, కాయ దశలో నీటి తడులివ్వాలి. ఆయా దశల్లో నీటి కొరత లేకుంటే తప్పకుండా అధిక దిగుబడిని సాధించవచ్చు. స్ప్రింక్లర్ల పద్ధతిలో పైరుకు నీరివ్వడంతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో నీరందించవచ్చు. సెప్టెంబర్ మాసంలో అవసరాన్ని బట్టి సోయా పంటకు ఒకటి నుంచి 2 తడులిస్తే మంచిది.

- లావణ్య, మండల వ్యవసాయాధికారి, న్యాల్‌కల్

ఆర్ఎంపీ నిర్వాకం!

వైద్యం వికటించి వ్యక్తి మృతి

బైరు మల్లేశం

చౌటకూర్, జూన్ 16: మండల కేంద్రమైన చౌటకూర్‌లో ఆర్ఎంపీ వైద్యం వికటించి వ్యక్తి మృతి చెందిన ఘటన జరిగింది. పుల్కల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన బైరు మల్లేశం(48) అనారోగ్యానికి గురవడంతో శనివారం మధ్యాహ్నం చౌటకూర్‌లోని ఆర్ఎంపీ వైద్యుడు వెంకటేశం వద్దకు వచ్చాడు. మల్లేశాన్ని పరిశీలించిన అనంతరం ఆర్ఎంపీ వైద్యుడు ఇంజక్షన్ ఇవ్వగా మల్లేశానికి చల్లచెమటలు వచ్చి, మూత్రవిసర్జన చేసుకున్నాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఈ విషయమై కుటుంబ సభ్యులు పుల్కల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆర్ఎంపీ వైద్యుడు వెంకటేశాన్ని అదుపులోకి తీసుకున్నారు. మల్లేశం మృతదేహానికి సంగారెడ్డిలోని ప్రభుత్వ ప్రధాన దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్ఎంపీ వైద్యుడు వెంకటేశం నిర్లక్ష్యం కారణంగానే తన భర్త మృతి చెందారంటూ మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పుల్కల్ ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఆలయ వార్షికోత్సవం

నారాయణఖేడ్, జూన్ 16: నారాయణ ఖేడ్ పట్టణంలోని దత్తాత్రేయ ఆలయంలో మంగళవారం ఆలయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ బాధ్యులు ముత్యం హన్మాండ్లు, శివలింగ పాటిల్‌లు తెలిపారు. గణపతి పూజ, రుద్రాభిషేకం, దత్తాత్రేయ మూల మంత్రం, రద్రాహ్వానం, గీతా స్వాహకార ఆహ్వానం, పూర్ణాహుతి, మహా మంగళహారతి, తీర్థప్రసాద వితరణ, మహత్ముల ప్రవచన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహరాజ్ ఆశీస్సులతో సిద్ధేశ్వరానంద మహరాజ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలి

రామచంద్రాపురం, జూన్ 16: ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వెంటనే ఆ శాఖకు మంత్రిని నియమించాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 40 వేలకుపైగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని, అందులో సుమారు 59లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. అదనంగా ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, ఇతర వృత్తి విద్యా కళాశాలలు, యూనివర్సిటీలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల విషయంలో అతికీలకంగా వ్యవహరించే విద్యాశాఖకు కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలు, ప్రైవేట్ స్కూల్స్ ఫీజుల వసూళ్లపై ప్రభుత్వం దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వైభవంగా శ్రీరామ శిలాయాత్ర

శ్రీరామ శిల శోభయాత్రలో మహేశ్వరశర్మ సిద్ధాంతి, తదితరులు

సంగారెడ్డి, జూన్ 16: సమాజ శ్రేయస్సుకు ప్రతిఒక్కరూ తమవంతు పాత్ర పోషించాలని గిరిజన సంక్షేమ అభివృద్ధి కార్యదర్శి శరత్‌నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సంగమేశ్వర ఆలయం నుంచి శ్రీరామ శిలాయాత్రను జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకుడు మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ప్రకాశం జిల్లా కొండాయపాలెం నుంచి కృష్ణ శిలను తీసుకువచ్చి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆంధ్ర నుంచి వచ్చిన కళాకారుల వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. రామరామ జపంతో ఆలయ ప్రాంగణం దద్దరిల్లింది. ఈ యాత్రలో జ్యోతిర్వాస్తు విద్యాపీఠం సహాధ్యక్షుడు ప్రశాంత్ కుమార్, తోపాజి అనంతకిషన్, దారం సంజయ్, సాహితీ రాము, విఠల్‌దాస్, శివకుమార్, వెంకన్న, వెంకట్‌రెడ్డి, దారం విలాస్ తదితరులు పాల్గొన్నారు.

మత ఘర్షణలు జరగకుండా చూడాలి

గుమ్మడిదల, జూన్ 16: హిందూ ముస్లింల ఐక్యతకు కట్టుబడి ఉన్నామని మైనార్టీ నాయకులు పోలీస్ అధికారులకు విన్నవించారు. ఆదివారం జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని మైనార్టీలు జిన్నారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్, గుమ్మడిదల ఎస్సైని కలిశారు. సోమవారం బక్రీద్ పండుగ కావడంతో పోలీస్ అధికారులను మైనార్టీ నాయకులు సిద్దిక్, ఫయాజ్‌షరీఫ్, జహీర్ తదితరులు సీఐ సుధీర్‌కుమార్‌ను, ఎస్సై మహేశ్వర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకొనేందుకు కృషి చేయాలని కోరారు. మత ఘర్షణలకు తాము వ్యతిరేకమన్నారు. హిందూముస్లింలు ఐక్యంగా ఉండాలని కోరుకుంటున్నామని తెలిపారు. బక్రీద్ పండుగను సంతోషంగా నిర్వహించుకోవాలని పోలీస్ అధికారులు సూచించారు.

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి

ఝరాసంగం: వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఝరాసంగం, జూన్ 16: గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరుతూ ఆదివారం ఝరాసంగం పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు బంటూ విశ్వానాథం స్థానిక నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో తనిఖీలు నిర్వహించి, గోహత్య జరగకుండా పోలీసు శాఖ నిఘాను ఏర్పాటు చేయాలని కోరారు.

గోవధను అరికట్టాలి

కోహీర్, జూన్ 16: బక్రీద్ సందర్భంగా గోవధ కాకుండా చూడాలని కోహీర్ బీజేపీ మండల అధ్యక్షుడు వైద్యనాథ్ కోరారు. ఆదివారం కోహీర్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు గోవధ నిషేధిత చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయాలని కోరారు. గోవులతోపాటు ఎద్దుల ప్రాణాలను కూడా కాపాడాలన్నారు. అక్రమంగా వాటిని వధించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో ఇలాంటి ఘటనలు జరిగితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కిష్టయ్య, నర్సింహులు, సతీశ్, రమేశ్, నరేశ్, విజేందర్, చంద్రశేఖర్, సంతోశ్, వంశవర్ధన్ రెడ్డి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

గోహత్యకు పాల్పడితే సహించేది లేదు

జిన్నారం, జూన్ 16: బక్రీద్ సందర్భంగా జిన్నారం మండలంలో గోహత్యలకు పాల్పడితే సహించేది లేదని బీజేపీ నాయకులు, హిందూ సంఘాలు హెచ్చరించాయి. గోవులను రక్షించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం జిన్నారం పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. గోహత్య మహాపాపమని, గోవులను రక్షించాలని విన్నవిస్తూనే ఉన్నామన్నారు. అయినా కొందరు గోహత్యకు గోవులను తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు ప్రతాప్ రెడ్డి, రాజిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, లక్ష్మణ్, సుధాకర్, బ్రహ్మేందర్, నక్క నరేందర్, రాజభార్గవ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గోవధను అరికట్టాలని వినతి

గుమ్మడిదల, జూన్ 16: గోవధను అరికట్టాలని పోలీస్ అధికారులకు బీజేపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని గుమ్మడిదల పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై మహేశ్వర్‌రెడ్డిని బీజేపీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, గిద్ది రాజు, ఉదయ్‌కుమార్, అంజిరెడ్డి తదితరులు ఎస్సైని కలిశారు. బక్రీద్ సందర్భంగా మైనార్టీలు గోవధ చేయకుండా వారికి అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి గ్రామంలో శాంతి కమిటీలు వేసి ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాదిగ జేఏసీ కన్వీనర్ డాక్టర్ పిడమర్తి రవి

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

నారాయణఖేడ్, జూన్ 16: జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మాదిగ జేఏసీ కన్వీనర్ డాక్టర్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. మాదిగ జనసభ కార్యక్రమంలో భాగంగా నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మన్సూర్‌పూర్‌లో ఆదివారం మాదిగ జేఏసీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడిగిపల్లి రమేశ్ అధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి రిజర్వేషనల్లో భాగంగా మాదిగలకు 7 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే నష్టపోతారని, రాష్ట్రంలో మాదిగలు అత్యధికశాతం ఉన్నారన్నారు. మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు రవికిరణ్, నాయకులు మనోహర్, అలిగే జీవన్, ప్రసాద్, సాయిలు, ఏసుదాస్, సుకుమార్ తుకారాం, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి ఖాజీపల్లిని కాపాడుకుందాం

కాలుష్యం నుంచి గ్రామాన్ని కాపాడుకోవాలని గ్రామస్తులు చేపట్టిన ర్యాలీ

జిన్నారం, జూన్ 16: కాలుష్యాన్ని అరికట్టి ఖాజీపల్లి గ్రామానికి పూర్వ వైభవాన్ని తీసుకువద్దామని న్యాయవాది, పర్యావరణ వేత్త దండే రమాకాంత్ గ్రామస్తులకు పిలుపునిచ్చారు. ఆదివారం గ్రామంలోని హనుమాన్ ఆలయం ఆవరణలో కాలుష్య నియంత్రణ కోసం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలతో కలిసి కాలుష్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1980లో ఖాజీపల్లి పచ్చదనంతో కళకళలాడేదని, చెరువులు, కుంటల్లో నీళ్లు తాగేవారిమని, నేడు ఆ పరిస్థితి కనుమరుగైందని వాపోయారు. కేవలం పరిశ్రమలు, అవి వదిలే కాలుష్యం కారణంగానే కలుషితం తాండవిస్తున్నదన్నారు. తాగే నీళ్లు కలుషితం అయ్యాయని, వ్యవసాయం మరుగున పడిందన్నారు. గ్రామ ప్రజలు అనారోగ్యంతో బాధపడుతున్నారన్నారు. ఖాజీపల్లి పరిధిలోని పరిశ్రమలను మరో చోటుకి తరలిస్తే గ్రామం కాలుష్య కోరల్లో నుంచి బయటపడుతుందన్నారు. దీనికోసం గ్రామంలో జేఏసీ ఏర్పాటు చేసి 500 మంది సంతకాలతో సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. త్వరలోనే కలెక్టర్‌ను కలిసి కాలుష్యంపై ఫిర్యాదు చేస్తామన్నారు. ఊరు కోసం ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీటీసీ ఆకుల భార్గవ్, నాయకుడు ఆకుల నవీన్‌కుమార్ మాట్లాడుతూ కాలుష్య కట్టడికి నడుం భిగించామని, ఖాజీపల్లి గ్రామ పూర్వవైభవం కోసం ఎంతవరకైనా పోరాడుతామన్నారు. కార్యక్రమంలో అశోక్, భీమ, చిరుమణి సురేశ్, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

గణేశ్ మండపానికి శంకుస్థాపన

గణేశ్ మండప నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న బీఆర్ఎస్ నేత ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, జూన్ 16: భారతీనగర్ డివిజన్‌లోని బీడీఎల్ కాలనీలో గణేశ్ మండప నిర్మాణానికి ఆదివారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. గతనెల బీడీఎల్ కాలనీ సొసైటీ సభ్యులు కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డిని గణేశ్ మండపం నిర్మాణం కోసం సహాయం చేయాలని కోరారు. స్పందించిన కార్పొరేటర్ సొంత నిధులతో గణేశ్ మండపాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చిరు. ఈ మేరకు మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు విఠల్‌రెడ్డి, రమేశ్, రాఘవచారి, సీతారంశాస్త్రీ, శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, మదన్‌చారి, జైపాల్, సత్యనారాయణ, త్రిపాల్ తదితరులు ఉన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

బ్యాడ్మింటన్ అకా